క్లుప్తంగా

మిత్రుడి జ్ఞాపకార్థం బెంచీల వితరణ



వనపర్తి (పాన్‌గల్): మండలంలోని మాధరావుపల్లికి చెందిన బోరెల్లి ఈశ్వర్ సెప్టెంబర్‌లో గుండెపోటుతో మృతి చెందాడు. దీంతో అతడితో కలిసి 2005–06 సంవత్సరంలో పదో తరగతి చదువుకున్న మిత్ర బృందం పోగుచేసిన రూ.50 వేలతో 8 బెంచీలు, విద్యార్థులకు నోటు పుస్తకాలను గురువారం అందజేశారు. ఈ సందర్భంగా మిత్రులు మాట్లాడుతూ తమతో పాటు చదువుకున్న మిత్రుడి జ్ఞాపకార్థం పోగు చేసిన నగదుతో మండల కేంద్రంలో ప్రయాణికులు, ఇతరులు సేద తీరేందుకు వీలుగా ఉండేలా 8 బెంచీలను, మాధరావుపల్లి ప్రాథమిక పాఠశాల విద్యార్థులకు నోటు పుస్తకాలను అందజేసినట్లు వారు పేర్కొన్నారు. మిత్ర బృందం ఆధ్వర్యంలో సేవ కార్యక్రమాలు పలువురికి ఆదర్శంగా నిలుస్తాయని పాఠశాల హెచ్‌ఎం వీరస్వామి పేర్కొన్నారు.

విద్యార్థులకు సన్మానం



పెబ్బేరు రూరల్: మండల కేంద్రంలోని మాంటిస్సోరీ ప్లే వే స్కూల్ విద్యార్థుల ప్రణవ్‌సాయిగౌడ్, అక్షయకుమార్, నందిని ఉమ్మడి మహబూబ్‌నగర్ ఖోఖో జట్టుకు ఎంపికయ్యారు. వీరిని పాఠశాల ప్రిన్సిపాల్ రాజేందర్‌గౌడ్, ఉపాధ్యాయ బృందం శాలువాతో గురువారం పాఠశాలలో సన్మానించారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ మాట్లాడుతూ విద్యార్థులు చదువుతో పాటు క్రీడలలో కూడా రాణించే విధంగా చేయడమే తమ లక్ష్యమన్నారు. కార్యక్రమంలో పీఈటీ మహేష్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

హైదరాబాద్ తరలిన పంచాయతీ కార్మికులు



వనపర్తి (పాన్‌గల్): సమ్మె సమయంలో పంచాయతీ కార్మికులకు ఇచ్చిన హామీలను అమలు చేయకపోవడాన్ని నిరసిస్తూ సీఐటీయూ ఆధ్వర్యంలో హైదరాబాద్‌లోని ఇందిరా పార్క్ వద్ద చేపట్టిన ధర్నాకు గురువారం మండలం నుంచి పలువురు పంచాయతీ కార్మికులు తరలివెళ్లారు. ఇప్పటికైనా కార్మికులకు ఉద్యోగ భద్రత, వేతనాల పెంపు, రెగ్యులర్‌గా వేతనాలు చెల్లింపు తదితర సమస్యలను ప్రభుత్వం పరిష్కరించాలని యూనియన్ నాయకులు డిమాండ్ చేశారు. ధర్నాకు తరలిన యూనియన్ నాయకులు శివరాజు, సుగ్రీవుడు, కిషన్‌నాయక్, నాగన్న, లాల్య, రంగస్వామి, ఎల్లస్వామి, బాలకృష్ణ ఉన్నారు.

నేడు కంటి వైద్య శిబిరం

ఆత్మకూర్: ఇండియన్ రెడ్‌క్రాస్ సొసైటీ, కందూర్ రాంరెడ్డి కంటి ఆస్పత్రి వారి ఆధ్వర్యంలో శుక్రవారం స్థానిక కమ్యూనిటీ హెల్త్ సెంటర్‌లో ఉచిత కంటి వైద్య శిబిరం నిర్వహిస్తున్నామని నిర్వాహకులు వెంకటయ్య తెలిపారు. ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 12గంటల వరకు శిబిరం కొనసాగుతుందని, కంటి వైద్య నిపుణులు వైద్య పరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులు ఇవ్వడంతో పాటు ఆపరేషన్లు అవసరమయ్యే వారికి ఉచిత రవాణా, భోజన వసతి కల్పించనున్నట్లు తెలిపారు. శిబిరానికి వచ్చేవారు ఆధార్, రేషన్, ఓటర్ కార్డు, కోవిడ్ వ్యాక్సిన్ సర్టిఫికెట్లను తీసుకురావాలని సూచించారు.

సామాజిక తనిఖీపై ప్రజావేదిక



సామాజిక తనిఖీ వివరాలు పరిశీలిస్తున్న ఏపీడీ సయ్యద్ సుల్తాన్

- లెక్క తేలని రూ.37,921
- నిధులను రికవరీ చేస్తాం
- ఏపీడీ సయ్యద్ సుల్తాన్

వనపర్తి (పాన్‌గల్): మండలంలో ఉపాధి హామీ పథకంలో వివిధ గ్రామాల్లో చేపట్టిన పనులకు ఖర్చు చేసిన నిధులపై నిర్వహించిన 13వ విడత సామాజిక తనిఖీపై గురువారం మండల కేంద్రంలోని ఎంపీడీఓ కార్యాలయ ఆవరణలో ప్రజావేదిక నిర్వహించారు. ఈ సందర్భంగా ఏపీడీ సయ్యద్ సుల్తాన్ మాట్లాడుతూ మండలంలోని 28 గ్రామ పంచాయతీల పరిధిలో 2022 జనవరి నుంచి 2023 మార్చి వరకు రూ.6 కోట్ల నిధులు ఖర్చయినట్లు తెలిపారు. మండలంలో వారం రోజుల పాటు నిర్వహించిన గ్రామ సభల్లో కొలతలో వ్యత్యాసం, అదనపు డబ్బుల చెల్లింపులు, తక్కువ పనులకు అదనపు రికార్డులు చేయడం, పనులు జరిగిన వాటికి ఫొటోలు ఇవ్వకపోవడం, హరితహారంలో నాటిన మొక్కలు రికార్డులో ఉన్న సంఖ్యకు, ఫీల్డ్‌లో ఉన్న సంఖ్యకు వ్యత్యాసాలు ఉండటం, కొన్ని గ్రామాల్లో పనులకు సంబంధించిన పలు రికార్డులు చూపకపోవడం వంటి అవకతవకలు జరిగినట్లు సామాజిక తనిఖీలో తేలిందన్నారు. మండలంలో మొత్తం సామాజిక తనిఖీలో రూ.37,921 నిధులు అవకతవకలు జరిగినట్లు గుర్తించామన్నారు. ఆయా డబ్బులను ఆయా గ్రామాల ఉపాధి సిబ్బంది నుంచి రికవరీ చేయనున్నట్లు ఆయన పేర్కొన్నారు. ఆయా గ్రామాల్లో సామాజిక తనిఖీ సిబ్బంది అందించిన నివేదికల ఆధారంగా నిధులను రికవరీ చేస్తూ సిబ్బందిపై తగు చర్యలు తీసుకుంటామన్నారు. సమావేశంలో ఎంపీపీ మామిళ్లపల్లి శ్రీధర్‌రెడ్డి, డీవీఓ రహీం, అంబుడ్స్‌మెడ్ జిల్లా సభ్యుడు సత్యనారాయణరెడ్డి, ఎంపీడీఓ నాగేశ్వర్‌రెడ్డి, ఎంపీఓ రఘురాములు, ఏపీఓ కుర్మయ్య, పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.

ఆత్మకూర్‌ను రెవెన్యూ డివిజన్‌గా ప్రకటించాలి



ఆత్మకూర్‌లో స్తంభించిన వాహనాలు

ఆత్మకూర్: ఆత్మకూర్‌ను రెవెన్యూ డివిజన్‌గా ప్రకటించాలని కోరుతూ నాల్గో రోజు గురువారం స్థానిక గాంధీచౌక్‌లో డివిజన్ సాధన సమితి ఆధ్వర్యంలో రాస్తారోకో నిర్వహించారు. గతంలో తాలూకా కేంద్రంగా అన్ని రకాల కార్యాలయాలతో కళకళలాడిన ఆత్మకూర్ ప్రస్తుతం పూర్వ వైభవాన్ని కోల్పోయి దీనస్థితికి చేరుకుందని ఆవేదన వ్యక్తం చేశారు. రాజుల సంస్థానంగా పేరొందిన ఆత్మకూర్ చిన్న మండలంగా మారడంతో వ్యాపారాలు పూర్తిగా మందగించాయని వనపర్తి జిల్లాలో ఒకే డివిజన్ ఉండడంతో ఇబ్బందులు తలెత్తుతున్నాయన్నారు. ప్రస్తుతం అన్ని రకాల ప్రభుత్వ కార్యాలయాలు తరలిపోవడంతో కళ తప్పిందని ఆవేదన వ్యక్తం చేసారు. వనపర్తి జిల్లాలోని ఆత్మకూర్‌లో అన్నిరకాల ప్రభుత్వ కార్యాలయాలు ఏర్పాటుకు అనువైన వనరులు ఉన్నాయని, ముఖ్యమంత్రి కేసీఆర్ దృష్టిసారించి డివిజన్‌గా ప్రకటించి న్యాయం చేయాలని డిమాండ్ చేశారు.

డివిజన్‌గా ప్రకటించే వరకు ఉద్యమం

ఆత్మకూర్‌ను రెవెన్యూ డివిజన్‌గా ప్రకటించేంతవరకు ఆందోళన కార్యక్రమాలను చేపడుతామని, దశల వారీగా డివిజన్ ఉద్యమం ఉధృతంగా చేపడుతామని సాధన సమితి నాయకులు ప్రకటించారు. అవసరమైతే ఆమరణ నిరాహార దీక్షలకు పూనుకుంటామని, అన్ని పార్టీలు, ప్రజా, కుల, యువజన, సంఘాలను సంఘటితం చేసి ఆత్మకూర్‌కు జరిగిన అన్యాయంపై ఉద్యమిస్తామని స్పష్టం చేశారు. కార్యక్రమంలో డివిజన్ సాధనసమితి నాయకులు కుర్ని రవికాంత్, గడ్డంశ్రీనివాస్‌యాదవ్, అశ్విన్‌కుమార్, అశోక్‌రావు, రాబర్టు, గంగాధర్‌గౌడ్, ఆనంద్, ఖాజపాష, చిన్ననర్సింహ, ఎస్టీడీ శ్రీను, అజ్జ పాగ లక్ష్మణ్, రవీందర్‌రెడ్డి, శ్రీనివాస్‌రెడ్డి, బాలకృష్ణ, రాము, వెంకట్రాములు, సీఎస్‌శెట్టి, కరుణాకర్, యాదగిరిశెట్టి, అనుదీప్ పాల్గొన్నారు.

నిలిచిన వాహనాలు.. స్తంభించిన ట్రాఫిక్

రెవెన్యూ డివిజన్ ఏర్పాటును కోరుతూ గాంధీ చౌక్‌లో గంటపాటు రాస్తారోకో చేపట్టడంతో వాహనాలు భారీగా నిలిచిపోవడంతో రాకపోకలు స్తంభించి తీవ్ర ట్రాఫిక్ సమస్య ఏర్పడింది. విషయం తెలుసుకున్న సీఐ కేఎస్ రత్నం, ఎస్‌ఐ నరేందర్ ఘటన స్థలానికి చేరుకుని రాస్తారోకోను విరమించుకోవాలని, ట్రాఫిక్ స్తంభించడంతో ప్రయాణికులు ఇబ్బందులు పడుతున్నారని వారించారు. దీంతో కొద్దిసేపు పోలీసులు, ఆందోళనకారుల మధ్య వాగ్వివాదం చోటుచేసుకుంది. గతంలో అఖిలపక్షం జేఏసీ ఆధ్వర్యంలో ఆత్మకూర్‌ను రెవెన్యూ డివిజన్‌గా ప్రకటించాలని కోరుతూ 100 రోజులు దీక్షలు చేపట్టిన విషయాన్ని గుర్తుచేశారు. అప్పట్లో ఎంపీ ఏపీ జితేందర్‌రెడ్డితో పాటు మంత్రి హరీష్‌రావు సీఎం కేసీఆర్ చేత డివిజన్ ప్రకటన చేయిస్తామన్న హామీ ఇచ్చారన్నారు. బుధవారం అభివృద్ధి కార్యక్రమాల ప్రారంభోత్సవాల్లో భాగంగా మక్తల్‌కు వచ్చిన మంత్రి హరీశ్‌రావు ఆత్మకూర్ డివిజన్ విషయం ఊసేత్తకపోవడం విచారకరమని అన్నారు. మక్తల్ ఎమ్మెల్యే చిట్టెం రామ్మోహన్‌రెడ్డి సతీమణి చిట్టెం సుచరిత సభా వేదికపై ఆత్మకూర్ డివిజన్ విషయాన్ని ప్రస్తావించిన మంత్రి పెడచెవిన పెట్టడం ఏమిటని ప్రశ్నించారు.

ఆశా, అంగన్‌వాడీల సమస్యలు పరిష్కరించాలి

చిన్నంబావి: ఆశావర్కర్లు, అంగన్‌వాడీల న్యాయపరమైన సమస్యలను ప్రభుత్వం తక్షణమే పరిష్కరించాలని కోరుతూ చేపట్టిన నిరవధిక సమ్మెకు మండల కాంగ్రెస్ పార్టీ నాయకులు మద్దతు తెలిపారు. టీపీసీసీ సభ్యుడు చింతలపల్లి జగదీశ్వర్‌రావు అందించిన రూ.20వేల ఆర్థికసాయాన్ని ఆశా, అంగన్‌వాడీలకు మండల వర్కింగ్ ప్రెసిడెంట్ ఖాదర్‌యాదవ్, నరేందర్‌గౌడ్ అందించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గ్రామీణ స్థాయిలో ఆశా వర్కర్లు చేస్తున్న సేవలు వెలకట్టలేనివని, వారు 11రోజులుగా సమ్మె చేస్తున్నా నేటికీ ప్రభుత్వం స్పందించకపోవటం దారుణమన్నారు. అదేవిధంగా రాష్ట్రం ఏర్పడిన నాటి నుంచి అంగన్‌వాడీలతో వెట్టిచాకిరీ చేయించుకుని, వారికి ఉద్యోగ భద్రత కల్పించట్లేదని ఆందోళన వ్యక్తం చేశారు. రానున్న ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ ప్రభుత్వం ఏర్పడుతుందని, అప్పటి వరకు ఎవరూ అధైర్య పడొద్దని, మహిళలకు ప్రత్యేకంగా సంక్షేమ పథకాలు అందించడమే గాక వారిని అన్నివిధాల ఆదుకోవడమే కాంగ్రెస్ పార్టీ లక్ష్యమన్నారు. కార్యక్రమంలో పుల్లారెడ్డి, రామ్‌సింగ్, రాము, బాలగౌడు, మోహన్‌రెడ్డి, వెంకటస్వామి, బ్రహ్మయ్య తదితరులు పాల్గొన్నారు.



ఆశాలకు ఆర్థికసాయం అందిస్తున్న నాయకులు

నేడు అమరచింతకు ఎమ్మెల్యే రాక

అమరచింత: పట్టణంలో జరిగే వివిధ అభివృద్ధి కార్యక్రమాల్లో పాల్గొనేందుకు మక్తల్ ఎమ్మెల్యే చిట్టెం రామ్మోహన్‌రెడ్డి శుక్రవారం వస్తున్నారని తహసీల్దార్ చాంద్ పాషా, మున్సిపల్ చైర్‌పర్సన్ మంగమ్మ తెలిపారు. బతుకమ్మ చీరలు, గృహలక్ష్మి లబ్ధిదారులకు ప్రొసీడింగ్‌లు, క్రీడా మైదానాలకు కిట్లు, కల్యాణలక్ష్మి, షాదీముబారక్ చెక్కులను పంపిణీ చేస్తున్నట్లు వెల్లడించారు. లబ్ధిదారులు సకాలంలో మున్సిపల్ కార్యాలయానికి హాజరు కావాలని కోరారు.

బాధిత కుటుంబాలకు ఆర్థికసాయం

వీపనగండ్ల: మండల కేంద్రానికి చెందిన హోటల్ పాండురంగాచారి ఇటీవల అనారోగ్యానికి గురికాగా అతడికి 1987 పదో తరగతి పూర్వ విద్యార్థులు రూ.10 వేల ఆర్థికసాయం అందజేశారు. అనారోగ్యానికి గురైన పాండురంగాచారి త్వరగా కోలుకోవాలని చిన్ననాటి మిత్రులు భాస్కర్‌రెడ్డి, సురేందర్, చంద్రశేఖర్‌రెడ్డి, వెంకటేశ్వర్‌రెడ్డి, శ్రీనివాసులు ఆశిస్తున్నామన్నారు.

పెబ్బేరు రూరల్: శ్రీరంగాపురం మండల కేంద్రంలోని కేశపాగ నాగన్న అనారోగ్యంతో బుధవారం మృతి చెందారు. విషయం తెలుసుకున్న కాంగ్రెస్ జిల్లా అధ్యక్షుడు, స్థానిక జెడ్పీటీసీ రాజేంద్రప్రసాద్‌యాదవ్, స్థానిక కాంగ్రెస్ నాయకులతో కలిసి గురువారం మృతదేహానికి పూలమాలవేసి నివాళులర్పించారు. బాధిత కుటుంబాన్ని పరామర్శించి ఆర్థికసాయం అందజేశారు. కార్యక్రమంలో సొప్పరి రమేష్, పసుపుల రాములు, విష్ణు, రామరాజు, మద్దిలేటి, తిరుపతయ్య తదితరులు పాల్గొన్నారు.

బహిరంగ సభ విజయవంతం

కొత్తకోట: రాష్ట్ర వైద్య ఆరోగ్యశాఖ మంత్రి హరీశ్‌రావు పర్యటనను విజయవంతం చేసినందుకు నియోజకవర్గంలోని బీఆర్‌ఎస్ కార్యకర్తలకు, అభిమానులకు, ప్రజాప్రతినిధులకు జెడ్పీవైస్ చైర్మన్ వామన్‌గౌడ్ కృతజ్ఞతలు తెలిపారు. గురువారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వామన్‌గౌడ్ మాట్లాడుతూ దేవరకద్ర ఎమ్మెల్యే ఆల వెంకటేశ్వర్‌రెడ్డి ఆధ్వర్యంలో మంత్రి హరీశ్‌రావు పర్యటన సందర్భంగా కొత్తకోటలో ఏర్పాటు చేసిన బహిరంగ సభ విజయవంతం అయ్యేందుకు ప్రతి కార్యకర్త కృషి చేశారని కొనియాడారు. ఎమ్మెల్యే అడిగిన వెంటనే నియోజకవర్గంలో డయాలసిస్ కేంద్రాన్ని ఏర్పాటు చేసేందుకు స్పందించిన మంత్రికి నియోజకవర్గ ప్రజల, ఎమ్మెల్యే తరఫున వామన్‌గౌడ్ కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో సర్పంచ్‌ల సంఘం మండల అధ్యక్షుడు ఆకుల శ్రీనివాసులు, లక్ష్మణ్‌నాయక్, కౌన్సిలర్ రాములుయాదవ్, కొల్లంపల్లి యాదవ్ తదితరులు ఉన్నారు.

ఉద్యోగాల్లో ఉన్నతంగా రాణించాలి



ఆత్మకూర్‌లో కానిస్టేబుళ్లను సన్మానిస్తున్న క్రీడాకారులు

ఆత్మకూర్: ఇటీవల వెలువడిన కానిస్టేబుల్ ఫలితాల్లో ఎంపికైన ఆత్మకూర్‌కు చెందిన దిలీప్, ముబ్బషీర్, మహేశ్వర్‌రెడ్డి, మునవ్వర్, రఘు, శరత్, అభిషేక్‌కుమార్‌ను, వారి శిక్షకుడు అంబేడ్కర్‌ను గురువారం రాత్రి స్థానిక మినీస్టేడియం ఆవరణలో క్రీడాకారులు శాలువాలతో సన్మానించారు. కానిస్టేబుల్‌గా ఎంపికైన అభ్యర్థులను మున్సిపల్ చైర్‌పర్సన్ గాయత్రి, వైస్‌చైర్మన్ విజయభాస్కర్‌రెడ్డి, బీఆర్‌ఎస్ మండల అధ్యక్షుడు రవికుమార్‌యాదవ్ అభినందించారు. కార్యక్రమంలో ఖాదర్, బాలు, మురళీ, దివాకర్, చిన్న నర్సింహ, అఫ్రోజ్, డాక్టర్ సందీప్‌రెడ్డి, తదితరులు ఉన్నారు.

ఒకే ఇంట్లో ఇద్దరికి..

కొత్తకోట రూరల్ (పెద్దమందడి): రాష్ట్ర ప్రభుత్వం ప్రకటించిన కానిస్టేబుల్ ఫలితాల్లో పెద్దమందడి మండలంలోని చీకరుచెట్టుతండా చెందిన ఒకే ఇంట్లో ఇద్దరు ఉద్యోగాలు సాధించారు. తండాకు చెందిన అన్నదమ్ములు అంగోతు శివుడు, అంగోతు రాజు కానిస్టేబుల్ ఉద్యోగాలు సాధించడంపై గ్రామ ఉపసర్పంచ్ రమేష్‌నాయక్ హర్షం వ్యక్తం చేశారు.

అక్కా, తమ్ముళ్ల ప్రతిభ

చిన్నంబావి: మండలంలోని లక్ష్మీపల్లికి చెందిన అల్లూరి సుధాకర్‌రెడ్డి కుమార్తె లావణ్య సివిల్ కానిస్టేబుల్‌గా, కుమారుడు అశోక్‌కుమార్‌రెడ్డి ఫైర్‌మెన్‌గా ఎంపకయ్యారు. నిరుపేద కుటుంబంలో పుట్టడంతో పాటు చిన్నతనంలోనే తల్లిని కోల్పోయినప్పటికీ కష్టపడి చదివి ప్రభుత్వ ఉద్యోగం సాధించడంపై గ్రామస్తులు హర్షం వ్యక్తం చేశారు. గ్రామానికి చెందిన పరమేష్‌యాదవ్, మహేష్, నరహరి, శ్రీధర్‌రెడ్డి, చాంద్ పాష, వెంకటేశ్ వారిని అభినందించారు.

అమరచింత: మున్సిపాలిటీకి చెందిన యువకులు వివిధ ప్రభుత్వ రంగాల్లో ఉద్యోగాలు సాధించి పట్టణ కీర్తిని నలువైపులా చాటాలని మున్సిపల్ చైర్‌పర్సన్ మంగమ్మ కోరారు. పట్టణానికి చెందిన అజ్జపాగ రఘు కుమారుడు దినాకర్ ఏఆర్ కానిస్టేబుల్‌గా ఎంపిక్వడంతో శాలువ, పూలమాలతో గురువారం సత్కరించారు. పట్టణానికి చెందిన ఎంతో మంది యువకులు డాక్టర్లుగా, ఇంజినీర్లుగా, ప్రభుత్వ ఉపాధ్యాయులు, కానిస్టేబుల్‌గా తదితర రంగాల ఉద్యోగాలు సాధిచడం సంతోషకరమన్నారు. కార్యక్రమంలో నాగభూషణంగౌడ్, రాజేందర్‌సింగ్, రమేష్ ముదిరాజ్, అక్కల నరసింహులుగౌడ్, కౌన్సిలర్ లెనిన్ పాల్గొన్నారు.



అమరచింతలో..

మండలం నుంచి 11 మంది

పాన్‌గల్: ప్రభుత్వం విడుదల చేసిన పోలీస్ కానిస్టేబుల్ ఫలితాల్లో మండలం నుంచి 11 మంది ఉద్యోగానికి ఎంపికయ్యారు. మండలంలోని శాగాపూర్ నుంచి ఐదుగురు సతీష్, వంశీ, గణేష్, శిరీష, శ్రీకాంత్, కేతేపల్లిలో సాయి చరణ్, శివమ్మ, తెల్లరాళ్లపల్లితండా నుంచి రాజు, చంద్రకళ, లక్ష్మణ్, గోప్లాపూర్ నుంచి వెంకటేష్ ఎంపికయ్యారు.

వీపనగండ్ల: మండలంలోని పలు గ్రామాలకు చెందిన 8 మంది యువకులు ఇటీవల నిర్వహించిన పోలీసు కానిస్టేబుల్ ఎంపిక పరీక్షల్లో ప్రతిభ కనబర్చి కానిస్టేబుల్ ఉద్యోగాలను సంపాదించారు. వీపనగండ్లకు చెందిన ప్రదీప్, శివ, శ్రీకాంత్, పుల్గర్‌చర్లకు చెందిన శివకృష్ణ, కల్వరాల గ్రామానికి చెందిన భూపాల్, బొల్లారం గ్రామానికి చెందిన మహేష్ కానిస్టేబుల్ ఉద్యోగాలను సాధించారు.

సీసీరోడ్డు నిర్మాణానికి భూమిపూజ

వనపర్తి టౌన్: జిల్లా కేంద్రంలోని 32వ వార్డులో కౌన్సిలర్ నాగన్నయాదవ్ సీసీ రోడ్డు నిర్మాణాన్ని భూమిపూజ చేసి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. మంత్రి నిరంజన్‌రెడ్డి హయాంలో జిల్లా కేంద్రం అభివృద్ధి వైపు నడుస్తుందని, ప్రధాన కూడళ్ల, రహదారులపైనే కాకుండా అంతర్గత రహదారులు, డ్రెయినేజీ వ్యవస్థపై దృష్టిసారిస్తూ అభివృద్ధి చేయిస్తున్నారని హర్షం వ్యక్తం చేశారు. మంత్రి కృషితో సీసీ రోడ్డు నిర్మాణాన్ని ప్రారంభించినట్లు పేర్కొన్నారు. అరుణ్ ప్రకాష్, డాక్టర్ నాగరాజు, వార్డు అధ్యక్షుడు మల్లికార్జున స్వామి, సత్యంసాగర్, ధర్మారెడ్డి, మధుసూదన్‌రెడ్డి, వెంకటస్వామి, రవి, సీఆర్‌పి మధుసూదన్‌రెడ్డి, తేజ, శివ, వార్డు ప్రజలు పాల్గొన్నారు.



సీసీ రోడ్డు నిర్మాణానికి భూమిపూజ చేస్తున్న నాగన్న యాదవ్

పీఎం నిర్ణయంపై బీజేపీ నాయకుల హర్షం

వనపర్తి టౌన్: పాలమూరులో జరిగిన బహిరంగ సభలో ప్రధానమంత్రి మోదీ ఇచ్చిన మాట మేరకు బుధవారం అత్యవసర కేబినెట్ సమావేశంలో రాష్ట్ర కృష్ణా జలాల వాటాపై ట్రిబ్యునల్ కమిటీ వేయడంపై బీజేపీ నాయకులు హర్షం వ్యక్తం చేశారు. ఈ మేరకు గురువారం జిల్లా కేంద్రంలోని రాజీవ్‌చౌక్‌లో బాణసంచా కాల్చి సంబరాలు జరుపుకొన్నారు. ఈ సందర్భంగా పట్టణ అధ్యక్షుడు బచ్చు రాము మాట్లాడుతూ.. పసుపు బోర్డు ఏర్పాటుకు ఆమోదం తెలుపుతూ నిధులు మంజూరు చేయడం, ములుగు జిల్లాలో సమ్మక్క, సారక్క పేర్లపై రాష్ట్రంలో మొట్టమొదటి గిరిజన యూనివర్సిటీ ఏర్పాటుకు కేబినేట్ ఆమోదం తెలిపిందన్నారు. కార్యక్రమంలో జిల్లా ప్రధాన కార్యదర్శి నారాయణ, రామన్‌గౌడ్, ఉపాధ్యక్షురాలు సుమిత్రమ్మ, జిల్లా కార్యదర్శి చిత్తారి ప్రభాకర్, రామ్మోహన్, నాయకులు అనుజ్ఞారెడ్డి, రాయన్న సాగర్, రవి, రఘు, గోవిందు, రఘు యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

బూత్ కమిటీలు బలోపేతం చేయాలి

ఖిల్లాఘనపురం: జిల్లాలోని ప్రతి గ్రామంలో బూత్‌కమిటీలను బలోపేతం చేయడం వలన బీజేపీని అధికారంలోకి తీసుక రావడానికి అవకాశం ఉటుందని నాగర్‌కర్నూల్ పార్లమెంట్ ఇన్‌చార్జ్ బుడ్డన్న అన్నారు. గురువారం మండల కేంద్రంలో బీజేపీ ప్రవాస్ యోజన కార్యక్రమంలో భాగంగా మండల అధ్యక్షుడు నవీన్‌రెడ్డి అధ్యక్షతన మండల కమిటీలు, బూత్‌కమిటీల అధ్యక్షులు, శక్తికేంద్రాల ఇన్‌చార్జులకు సమావేశం నిర్వహించారు. కార్యక్రమంలో జిల్లా అధికార ప్రతినిధి బుచ్చిబాబుగౌడు, మండల కార్యదర్శులు అంజనేయులు ముదిరాజ్, శివశంకర్, ఆశన్న, రవినాయక్, సత్యనారాయణ, ఈదమ్మ, గోపి, రాంచంద్రయ్య, గోపాల్‌రెడ్డి, భద్రయ్య,ంకటరమణ, తదితరులు పాల్గొన్నారు.



ఖిల్లాఘనపురంలో మాట్లాడుతున్న బుడ్డన్న

‘బతుకమ్మ’ చరిత్రకు సాక్ష్యం

వనపర్తి టౌన్: దసరా పండుగను పురస్కరించుకొని మహిళలకు పెద్ద అన్నయ్యలా సీఎం కేసీఆర్ బతుకమ్మ చీరలను పంపిణీ చేస్తున్నారని మున్సిపల్ చైర్మన్ గట్టుయాదవ్ అన్నారు. ఈ మేరకు గురువారం జిల్లా కేంద్రంలోని ఇందిరా కాలనీలో మున్సిపల్ వైస్ చైర్మన్ వాకిటి శ్రీధర్‌తో కలిసి మహిళలకు చీరలు పంపిణీ చేశారు. కార్యక్రమంలో కౌన్సిలర్ పాకనాటి కృష్ణ, స్టార్ రహీం, రమేష్ నాయక్, మహేష్, చంద్రయ్య తదితరులు పాల్గొన్నారు.

ఖిల్లాఘనపురం: ఆడపడుచుల ఆత్మగౌరవన్ని పెంచేందుకే ముఖ్యమంత్రి కేసీఆర్ బతుకమ్మ చీరలను అందజేస్తున్నారని అప్పారెడ్డిపల్లి సర్పంచ్ అనెమోని కృష్ణవేణి, గట్టుకాడిపల్లి సర్పంచ్ దేవేందర్ ముదిరాజ్ అన్నారు. గురువారం ఆయా గ్రామాల్లో వారు బతుకమ్మ చీరలను మహిళలకు పంపిణీ చేశారు.

వనపర్తి (పాన్‌గల్): మండల కేంద్రంలోని రైతువేదికలో గురువారం మహిళలకు బతుకమ్మ చీరలను ఎంపీపీ మామిళ్లపల్లి శ్రీధర్‌రెడ్డి పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బతుకమ్మ చరిత్రకు సజీవ సాక్ష్యంగా రాష్ట్ర ప్రభుత్వం ఘనంగా నిర్వహిస్తుందన్నారు. ఆడ బిడ్డలకు దసరా కానుకగా ప్రభుత్వం బతుకమ్మ చీరలను అందజేస్తున్నట్లు ఆయన పేర్కొన్నారు. సీఎం కేసీఆర్ అన్ని వర్గాల సంస్కృతి, సాంప్రదాయాలను గౌరవిస్తున్నారని కొనియాడారు. మండలంలోని 28 గ్రామ పంచాయతీలకు 17,175 చీరలకు గాను 15,125 చీరలు వచ్చినట్లు ఆయన పేర్కొన్నారు. 18ఏళ్లు నిండిన ప్రతి మహిళకు చీరలను అందిస్తారని తెలిపారు. కార్యక్రమంలో తహసీల్దార్ మీరాబాయి, ఎంపీడీఓ నాగేశ్వర్‌రెడ్డి, ఎంపీటీసీ కృష్ణ, ఆర్‌ఐ మహేష్, మహిళలు, డీలర్లు పాల్గొన్నారు.



వనపర్తిలో బతుకమ్మ చీరలు పంపిణీ చేస్తున్న మున్సిపల్ చైర్మన్ గట్టుయాదవ్, వైస్ చైర్మన్ శ్రీధర్


కొత్తకోట రూరల్: మండలంలోని వివిధ గ్రామాల్లో నిర్మించిన తెలంగాణ క్రీడా మైదానాలకు కేసీఆర్ స్పోర్ట్స్ కిట్లు, 22గ్రామాలకు బతుకమ్మ చీరలను గురువారం మండల పరిషత్ కార్యాలయంలోని ప్రొఫెసర్ జయశంకర్ సమావేశ మందిరంలో ఎంపీపీ గుంత మౌనిక, జెడ్పీవైస్ చైర్మన్ వామన్‌గౌడ్, తహసీలార్ బాల్‌రెడ్డి, ఎంపీడీఓ కృష్ణయ్య అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రభుత్వం గ్రామీణ క్రీడా కారులను ప్రోత్సహిస్తుందని, క్రీడాకారులు సద్వినియోగం చేసుకోవాలన్నారు. అదేవిధంగా బతుకమ్మ చీరలను ప్రతి ఒక్కరూ తీసుకుని బతుకమ్మ సంబరాల్లో పాల్గొని తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలను కాపాడాలని కోరారు. కార్యక్రమంలో వైస్ ఎంపీపీ వడ్డె శ్రీనివాసులు, ఏపీఎం, పంచాయతీ కార్యదర్శులు, సర్పంచ్‌లు తదితరులు పాల్గొన్నారు.



కొత్తకోటలో..

గోపాల్‌పేట: స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీపీ సంధ్య, జెడ్పీటీసీ భార్గవి సమక్షంలో బతుకమ్మ చీరలను పంపిణీ చేసినట్లు తహసీల్దార్ శ్రీనివాసులు తెలిపారు. మండలంలో ఇప్పటి వరకు 2,500 బతుకమ్మ చీరలు పంపిణీ చేశామని, కార్యక్రమం కొనసాగుతుందని చెప్పారు. కార్యక్రమంలో సర్పంచు శ్రీనివాసులు, వైస్ ఎంపీపీ శేఖర్, ప్రజాప్రతినిధులు, అధికారులు పాల్గొన్నారు. అలాగే రేవల్లి మండలంలో ఎంపీపీ సేనాపతి బతుకమ్మ చీరలు పంపిణీ చేశారు.

వీపనగండ్ల: బతుకమ్మ పండుగను పురస్కరించుకొని మహిళలకు అందజేసేందుకు ప్రభుత్వం నుంచి బతుకమ్మ చీరలు వచ్చాయని తహసీల్దార్ వరలక్ష్మి, డిప్యూటీ తహసీల్దార్ లక్ష్మీకాంత్ తెలిపారు. మండలంలోని మొత్తం 17 రేషన్ షాపులకు 8,833 చీరలు ప్రభుత్వం నుంచి అందాయని, ఉన్నతాధికారుల ఆదేశం మేరకు వాటిని పంపిణీ చేస్తామని వారు తెలిపారు.



పాన్‌గల్‌లో బతుకమ్మ చీరలను అందజేస్తున్న ఎంపీపీ, అధికారులు



గోపాల్‌పేటలో..



అప్పారెడ్డిపల్లిలో..

మహిళా సంక్షేమమే లక్ష్యం

కొల్లాపూర్: మహిళా సంక్షేమానికి ప్రభుత్వం ప్రాధాన్యం ఇస్తోందని ఎమ్మెల్యే బీరం హర్షవర్ధన్ రెడ్డి అన్నారు. గురువారం పట్టణంలోని ఎస్‌ఎం గార్డెన్‌లో నియోజకవర్గంలోని పలు మండలాలకు చెందిన 406 మంది లబ్ధిదారులకు కల్యాణలక్ష్మి, షాదీముబారక్ చెక్కులను ఆయన పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఆర్డీఓ నాగరాజు, తహసీల్దార్ శ్రీకాంత్, మార్కెట్ చైర్మన్ కిషన్‌నాయక్, మున్సిపల్ చైర్‌పర్సన్ విజయలక్ష్మి, ప్రజాప్రతినిధులు, నాయకులు పాల్గొన్నారు.

పంచాయతీ భవనం ప్రారంభం

కొల్లాపూర్ రూరల్: మండలంలోని ఎల్లూరులో నూతనంగా నిర్మించిన గ్రామ పంచాయతీ భవనాన్ని ఎమ్మెల్యే బీరం హర్షవర్ధన్ రెడ్డి సర్పంచ్ బండి లక్ష్మిదేవమ్మతో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ పంచాయతీ భవన నిర్మాణానికి రూ.20 లక్షలు ఈజీఎస్ నిధులు మంజూరు చేశామన్నారు. అంతకు ముందు డాక్టర్ బీఆర్ అంబేడ్కర్, గాంధీ విగ్రహాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం బతుకమ్మ చీరలు, స్పోర్ట్స్ కిట్లను పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఎంపీటీసీ సభ్యురాలు మంజుల, గొర్ల కాపరుల సంఘం జిల్లా అధ్యక్షుడు గాలియాదవ్, బండి రాముడు, శేఖర్ శెట్టి, వార్డు మెంబర్లు, తదితరులు పాల్గొన్నారు.

కేసీఆర్ చిత్రపటానికి పాలాభిషేకం

పెద్దకొత్తపల్లి: మండల కేంద్రంలో ప్రభుత్వ జూనియర్ కళాశాల మంజూరు చేసినందుకు కేసీఆర్ చిత్రపటానికి కొల్లాపూర్ ఎమ్మెల్యే బీరంహర్షవర్ధన్ రెడ్డి గ్రామ యువకులతో కలిసి సీఎం కేసీఆర్ చిత్రపటానికి పాలాభిషేకం చేశారు.

మరమ్మతు చేపట్టండి

పెంట్లవెల్లి: మండల కేంద్రం నుంచి మంచాలకట్టకు వెళ్లే ప్రధాన రహదారిలో మిషన్ భగీరథ గేట్‌వాల్వ్ అమర్చారు. కొన్నిరోజుల నుంచి మరమ్మతుకు నోచుకుంది. గేట్‌వాల్వ్ నుంచి నీరు లీకేజీ అవుతోంది. నీటి వృథాను అరికట్టాలని పలుమార్లు అధికారులకు విన్నవించినా పట్టించుకోవడం లేదని వాపోయారు. ఇప్పటికైనా భగీరథ అధికారులు స్పందించి శాశ్వతంగా పరిష్కారించాలని కోరారు.